

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 18 ఏప్రిల్, 2022 సంచిక : 11

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా. ........ రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం ......... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**
Online Donations :
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
నాకిక్కడ బాగుండలేదు ........ 4
బాలవాణి ........ 7
భరతుడు ........ 10
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 15
సాయిభక్త దాసగణు ........ 18
శాశ్వత ధర్మగోప్త ........ 21
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 24
అమ్మతో ... ........ 26
మాతృసంస్థ కబుర్లు ........ 30

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



సాయివాణి పాఠకలోకానికి సాదరప్రణామాలు.

వసంతం వచ్చేసింది. నిన్నటి వరకూ ఆకులు రాల్చేస్తూ కన్నీరు కారుస్తున్నట్లుగా కన్పించిన వృక్ష సమూహాలన్నీ చిగురుటాకు గుత్తులతో సింగారించుకొంటున్నాయి. క్రమక్రమంగా పుష్పిస్తున్నాయి. చూస్తూ చూస్తుండగానే ఏదో మంత్రదండంతో తాకినట్లు యావత్ప్రకృతి ఆకృతి మార్చుకున్నది. అంతలోకే గ్రీష్మం వస్తుంది. నిప్పులు చెరుగుతుంది. ఇదంతా చూస్తూ ఆలోచిస్తుంటే సాధకులకు, సాయీ సేవకులకు ఈ ప్రకృతే పెద్ద గురువనిపిస్తూంటుంది.

మనలోని గత సంస్కారాలు, అహంభావాలు, యుగయుగాలుగా పాతుకొని ఉన్న బలహీనతలు-ఒక్కటొక్కటిగా రాల్చిపోసేయ్యాలి. వాటి స్థానంలో క్రొంగొత్త సంస్కారాలు, చక్కని యోచనాత్మకమైన ప్రణాళికలు, సాధనలు అంకురించాలి. క్రమంగా అవి తీవ్రమై, బలవత్తరమైన మన ఆంతర్యాన్ని జ్వలింపజేయాలి. దైవీశక్తి మనలో పరిమళించే వరకూ ఆ జ్వాల అలాగే రగులుతుండాలి. అమ్మో! ఆ తాపాన్ని(ఎండను) తట్టుకోవటం కష్టం అంటామా! అయితే ఫలితం ఎలా? మన సాధనకు సుమించేదెలా? ఫలించేదెలా?

సాయి స్వరూపమైన సమాజ పరమేశ్వరుని సేవించే వారికి ఎన్నెన్నో యిబ్బందులు ఎదురవుతాయి. రకరకాల పరీక్షలతో మన సత్తా ఎంతటిదో పరీక్షిస్తాడు పరమాత్ముడు. సేవ చేసినన్నాళ్లూ ఎవ్వరూ కలిసిరారు. ఒకవేళ నలుగురూ కలిసినా-అందులో కోపతాపాలు, ఈసు అసూయలు, సాంసారిక మాయలు, అంతర్గత కషాయాలు-ఎన్నెన్నో అడ్డుపడుతుంటాయి. "ఇక

ఫర్వాలేదు-మనసు స్థిరపడింది" అనుకొనేలోపలే-ఏదో జంఝా మారుతం సమూలముగా ఊగిసలాడటం-మళ్లీ మొదటికే రావటం. ఇలా ఎన్నిసార్లో! సేవ ఎవరికి చేస్తామో అక్కడి నుంచే విమర్శలు-ఎంత తిని ఎంత చేస్తున్నారో! అన్న సందేహాలు. ఒకవేళ ప్రాణం విసిగిపోయి అన్నీ మానేస్తే "ఓహో! ఏమీ లాభం దొరకటం లేదో ఏమో!" అన్న వ్యంగ్యాలు. సరిగా చెయ్యలేకపోతే "ఏమీ బాగోలేదు నిర్వహణ" అన్న పెదవి విరుపులు. ఒకవేళ అన్నీ సరిగా నడపాలన్న ఆరాటం చూపెడితే "అన్నింటా తమ చెయ్యే కనపించాలని ఆత్రుత చూపిస్తున్నారు" అన్న మూతి తిప్పళ్లు-యీ పంపిణీ మీద చెప్పకుంటూ పోతే సవాలక్ష పరీక్షలు. 'ఇవన్నీ సాయి పెడుతున్నవే! అసలివన్నీ సాయికే పరీక్షలు అన్న ధీమంతత్వంతో నడిస్తేనే ఫలితం దక్కేది.

కోకిల కంఠం అత్యంత సులభంగా పంచమస్వరం ఆలపిస్తుంది. అవును మరి చేదు చిగుళ్లు నమిలి మ్రింగిన సాధనే ఆ తీపిరాగాలనిచ్చింది దానికి. మల్లె మొక్కలకు ఆకులన్నీ దూసి పోస్తారు. అటుపై వచ్చే క్రొత్త ననలకే మొగ్గ తొడిగేది. ఎండ ముదిరేకొద్దీ మల్లెల పూత పెరుగుతుంది. పరిమళమూ పెరుగుతుంది. అలాగే సాధనలోని శిక్షణకూ, శిక్షలకూ కూడా తట్టుకున్నప్పుడే మన శిరమున జ్ఞానమల్లికాగుచ్ఛం పరిమళించేది.

మామిడిచెట్టును చూపించి దామూ అన్నాడు శ్రీ సాయినాధులవారు చెప్పిన వివరణ సచ్చరిత్ర చదివిన వారికి గుర్తుండే ఉంటుంది. పూతగా, పిందెలుగా, కాయలుగా-ఎన్నెన్ని తుఫానులు, పెనుగాలులు, రాళ్ల దెబ్బలు తిని ఉంటాయోగానీ, తొడిమలను అంటిపెట్టుకొనే ఉన్నాయి మామిడి కాయలు. అయినాసరే పండాలంటే మగ్గక తప్పటం లేదు. గాలిచొరవని, ఊపిరాడని 'కావు'లో మగ్గితేగాని మామిడిపండ్లు చక్కగా పండవు. మంచి వన్నెకు రావు. అలాగే సాధకుడు కడపటి క్షణం వరకూ కూడా గురుశ్రద్ధను హృదయంలో నిల్పుకొని తీవ్రసాధన చేస్తూ తనను తాను తపింపజేసుకుంటూ ఉండవలసిందే. లేనినాడు వన్నెకెక్కడు మరి! ఏదో





ఒక దశలో అసంతృప్తితోనో, గర్వంతోనో సాధన ఆపితే 'ఫలం' ఉండదు.

ఇవన్నీ చైత్ర వైశాఖాల ద్వారా మనం నేర్చుకోవలసిన సాధనలే! శ్రీ దత్తాత్రేయ స్వామి వారన్నట్లు-సాధకుడికి ప్రతి క్షణమూ సాధనే. ప్రతి సంఘటన నుంచీ, ప్రతి దృశ్యం నుంచీ ఏదో ఒకటి నేర్చుకొంటూ ఉంటాడు. అందుకే తమకు ఇరవై నలుగురు గురువులున్నారని వారన్నారు. గురు పరంపరకు ఆద్యులు దత్త దేవులేనంటారు. మన గురువుల మార్గమే మనకూ అనుసరణీయం, అంచేత దత్తుల వలెనే మనం కూడా యీ ఆమని, వైశాఖల నుంచి చక్కని సాధనా మార్గాన్ని అలవరచుకుందాం. 'ఎదుటి వారి మాటలు నన్ను గ్రుచ్చుకోవు గదా!' అని దిగమ్రింగి "మధురాచ వాణీ" అన్నట్లు కోకిలలాగా ప్రేమపూర్వకంగా మాట్లాడటం ఒకటి. మల్లె మొక్కలాగా తీవ్ర తాపాన్నైనా సహించి పరిమళాలెగజిమ్మటం రెండవది. ఎటువంటి శిక్షణనైనా సహించి పండి వన్నెకెక్కటం మూడవది. ఈ మూడూ సాధించే శక్తి సంతరించుకుందాం. ప్రసాద యాచకులమై సాయి మ్రోల నిలబడదాం.

## నాకిక్కడ బాగుండ లేదు

### పారంపరిక గాథ

అనగనగా ఒక ఊళ్లో ఒక చిన్న మాంసం వ్యాపారి ఉండేవాడు. అతడు మంచి భక్తుడు. అందరితో స్నేహంగా, ప్రేమతో కలసిమెలసి ఉండేవాడు. అతని వృత్తి కసాయి పని అయినా మనసు మాత్రం ఎంతో మంచిది. మాంసం కొనడానికి వచ్చి పోయే వారందరితో భగవంతుని గూర్చి చెప్తూ ఉండేవాడు. నిరంతరం నామం చెప్తుండేవాడు.

ఒకరోజు అతనికి నది ఒడ్డున ఒక సాలగ్రామం (విష్ణుశిల) దొరికింది. అదేమిటో అతనికి తెలియకపోయినా ఎందుకో నచ్చింది. తీసుకువచ్చి తన దుకాణంలో పెట్టాడు. అది సరిగ్గా అరవీశె బరువుంది. అంచేత

కసాయివాడు ఆ సాలగ్రామాన్ని తూకం రాయిలాగా వాడుకోవటం ప్రారంభించాడు. అదేం రాయో అతనికి తెలియదుగాని రోజూ తూకం రాళ్ళతోపాటు దానిని కూడా శుభ్రంగా కడిగేవాడు. బొట్లు పెట్టేవాడు. అలా అప్రయత్నంగానే సాలగ్రామ పూజ జరిగిపోతూండేది. సహజంగానే భక్తుడు కావటం వలన కీర్తనో, భజనో, నామమో నాలుక మీద నడుస్తూనే ఉండేది.

కొన్నాళ్లిలా గడిచాక ఒక బ్రాహ్మణుడు ఆ త్రోవవెంట వెడుతూండగా దుకాణంలోంచి మురికినీళ్లు విసిరిపారబోస్తుంటే ఆ సాలగ్రామశిల పొరపాటున జారి వీధిలోకి పడింది. అదీ సరిగ్గా ఆ బ్రాహ్మణుడి ముందే పడింది. అతడు బాగా శాస్త్రాలూ అవీ చదువుకున్నవాడు. చూస్తూనే సాలగ్రామాన్ని గుర్తించాడు. దాన్ని విసిరివేసిందెవరోనని చుట్టూ చూచాడు తన కొట్లో పనిచేసే కుర్రవాడు మాంసం కడిగిన మురికినీరు అలా వీధిలోకి విసరటం, తూకం రాయి పోయి పెద్దమనిషి ముందురపడటం చూసి కంగారు పడుతూ వచ్చి నమస్కరించాడు కసాయివాడు.

“పిల్లవాడు తెలవక చేసాడు బాబూ! క్షమించండి రాయిగాని తమరికి తగల్లేదు” గదా అన్నాడు నమస్కారం చేస్తూ.

“లేదులేగానీ, యీ రాతితో నువ్వు మాంసం తూస్తున్నావా?” అని అడిగాడు బ్రాహ్మణుడు. అవునని కసాయివాడు చెప్పగానే చాలా బాధ పడుతూ బ్రాహ్మణుడు దాని శక్తి, మహిమ వివరించి చెప్పాడు. “దేవాలయాలలోని శక్తి తరిగిపోతే యీ సాలగ్రామ శిల నుంచి శక్తి ప్రసరింపజేస్తారు” అని చెప్పాడు. అది వినగానే కసాయివాడు చాలా పశ్చాత్తాపపడి కన్నీళ్ల పర్యంతమయ్యాడు. “నాకు తెలీదు బాబయ్యా! ఏదో నదిలో దొరికింది-బాగుంది రాయి-అనుకున్నానంతే! చాలా అపచారం జరిగిపోయింది స్వామి!” అన్నాడు.

“సరే! జరిగిందేదో జరిగిపోయింది. ఆ సాలగ్రామాన్ని పాలతో శుద్ధి





చేసి నాకివ్వు మా పూజాపీఠంపైన ఉంచుతాను” అన్నాడు బ్రాహ్మణుడు. సరేనని యిచ్చేసాడు కసాయి.

ఇప్పుడు సాలగ్రామ శిల బ్రాహ్మణుడి పూజాపీఠంపైన ఉంది. సుప్రభాతాలు, అభిషేకాలు, పూజలు, హారతులు, నైవేద్యాలు, పవళింపు సేవలు-అట్టహాసంగా అన్ని అర్చనలూ జరుగుతున్నాయి. స్వామి వారిని పూలతోనూ, అగరుధూపాలతోనూ ముంచెత్తుతున్నాడు బ్రాహ్మణుడు. అలా కొన్ని నెలలు గడిచాయి. ఒకనాటి రాత్రి అతనికొక కల వచ్చింది. అందులో శ్రీ మహావిష్ణువు దర్శనమిచ్చాడు. బ్రాహ్మణుడు ఎంతో సంతోషంతో కలలోనే స్తోత్రం చేసాడు. విష్ణుమూర్తి ఆ స్తోత్రం విని యిలా అన్నాడు.

“చూడు నాయనా, నీవు చాలా గొప్ప భక్తుడివే, సందేహం లేదు. కానీ, నువ్వు నాకు భక్తుడవుకావు. నీ పూజా విధానానికీ, నీ భజనలకూ, స్తోత్రాలకూ భక్తుడివి. వాటిని ప్రేమించినట్లుగా నీవు నన్ను ప్రేమించలేవు. ఆ కసాయివాడి దగ్గర్నుంచి నన్నెందుకు తీసుకువచ్చావు? అతనికి శ్లోకాలు రావు, మంత్రాలు రావు, పూజలు, పురస్కారాలు రావు. అయినాగానీ, అతని హృదయం ప్రేమమయం. ఎంతో మెత్తని మాటలు, సదా చిరునవ్వుతో ఉండే ముఖం. చక్కని అతిథి సేవ, వృత్తి కఠినమైనదీ, క్రూరమైనదీ అయితేనేం! అతడు వచ్చిపోయే వారితో మాట్లాడే తీరు ఎంత మధురంగా ఉంటుంది. నా కథలు చెప్పటంలో ఎంత పారవశ్యం చెందుతాడు! నా నామం పలుకుతుండగానే అతని గుండెలో ఎంతటి మెత్తదనం, ఎంతటి ఆనందం! నన్ను కేవలం తూకపురాయిగానే భావించాడు. అయినాసరే పట్టుకోవటంలో ఎంత ప్రేమ, ఎంత మృదుత్వం!

నువ్వేమో ఏ భావనా లేకుండా యాంత్రికంగా అభిషేకాలు చేస్తున్నావు. మంత్రాలు చదువుతున్నావు. అదంతా పెద్ద రొదలాగా వినపడుతోంది నాకు. విసుగుపుడుతోంది. ప్రేమలేని పూజలు నాకు అక్కర్లేదు. ప్రేమస్పర్శతోనే నా గుండె పులకిస్తుంది. నాకు కసాయివాడి దగ్గరే బాగుంది. నన్నక్కడికే పంపించు” అన్నాడు. బ్రాహ్మణుడికి తన పొరపాటు అర్థమై తలవంచుకున్నాడు.

# బాలవాణి



అనగనగా ఒక సాధువున్నాడు. ఆయన చిన్ననాటి నుంచీ ఎంతో మంది శిక్షణలో పెరిగాడు. పెద్దవాడయ్యాక ఒక గురువుగారి దగ్గర భగవంతుడంటే ఏమిటో తెలుసుకొని, సన్యాసం తీసుకున్నాడు. ఒకసారి ఆయన ఒంటరిగా అడవిదారిన ప్రయాణం చేస్తూ ఉన్నాడు.

"శ్రీరామ జయరామ జయ జయరామ" అంటూ దైవ నామస్మరణ చేస్తూ నడుస్తున్నాడు. నట్టడవిలోకి వచ్చేటప్పటికి మధ్యాహ్నమైంది. ఎండ వేడికి తాళలేక సాధువు త్రోవలో కన్పించిన ఒక కొండగుహలోకి వెళ్లి కూర్చున్నాడు. మిటమిటలాడే ఎండలో నుంచి ఒకేసారి చీకటిగుహలోకి వెళ్లేసరికి కళ్లు అలుక్కుపోయినట్లై, సాధువుకు ఆ గుహలో ఏముందో కన్పించలేదు. నాలుగైదు నిముషాలపాటు కళ్లు మూసుకు కూర్చున్నాక చుట్టూ పరికించి చూచాడతడు. ఒక మూలగా రాసులు పోసి ఉన్న రత్నాలు, వజ్రాలు, వెండి నాణేలు, బంగారు నగలు సాధువు కంటబడ్డాయి. అంతే! ఒక్క ఉదటున లేచి, "అమ్మో! అమ్మో! మృత్యువు మృత్యువు" అంటూ గుహ బయటకు పరుగెత్తాడాయన. సాధువు తల్లిగారు చిన్నప్పటి నుంచీ చెప్తుండేది "మనది కాని సొమ్ము పాము వంటిది. కష్టార్జితం కానిది కాసైనా సరే తాకకూడదు. అసలలాటి సొమ్ము మృత్యువేననుకో. ఎప్పడూ దానికి దూరంగా ఉండు" అని. సాధువు తన జీవితంలో డబ్బు కొరకై జరిగే అన్యాయాలు, దౌర్జన్యాలు ఎన్నో చూచాడు. అంచేత ఆయన తన తల్లిగారు చెప్పింది నిజమేనని భావించి ఎప్పడూ డబ్బుకు దూరంగానే ఉండేవాడు. ఇప్పడు-నట్టడవిలో యింత డబ్బు ఒక్కసారి కనపడేసరికి పరుగెత్తుకొని వెళ్లిపోవటం ప్రారంభించాడు.

సాధువు కంగారుగా పరుగెత్తుకొంటూ రావటం కట్టెలు కొట్టుకోవడానికి వచ్చిన ముగ్గురు గ్రామీణులు చూచారు. ఏదైనా ఉపద్రవం హఠాత్తుగా వచ్చిపడుతోందా!? వాళ్లక్కూడా భయం వేసింది. వాళ్లు కూడా ఆయనతోపాటు పరుగెత్తుతూ "ఏమైంది స్వామి, ఏమిటలా పరుగెత్తుతున్నారు?" అని అడిగారు.





"మృత్యువయ్యా బాబూ! మృత్యువు! మీరు కూడా పరుగెత్తండి" అన్నాడు సాధువు.

"మృత్యువంటే చావేగదా! అది మీకెట్లా కనపడింది స్వామీ?" అని అడిగాడు మొదటివాడు.

"ఎక్కడ కనపడింది స్వామి" అన్నాడు రెండోవాడు పరుగెత్తుతూనే.

"అక్కడ కొండలేదూ! దానిలో చిన్నగుహ ఉంది. అందులో ఉందయ్యా!" అన్నాడు సాధువు. ఆ మాటతో కట్టెలు కొట్టేవాళ్లు సాధువును విడిచిపెట్టారు. కొండవైపు పరుగెత్తారు. "వద్దు, వద్దు, పోకండి, ఛస్తారా అన్యాయంగా" అని మొత్తుకున్నాడు సాధువు కాస్సేపు. అటుపైన తన త్రోవన తాను వెళ్లిపోయాడు.

కట్టెల వాళ్లు కొండను సమీపించి, మెల్లమెల్లగా గుహ లోపలికి తొంగి చూచారు. వాళ్లకక్కడ ఎవ్వరూ కన్పించలేదు. ధైర్యం తెచ్చుకొని లోపలికి వెళ్లారు. మూలనున్న ధనరాశి, రత్నాలు, బంగారం వారి కంటపడింది. వాళ్లు నోళ్లు తెరిచారు. "సాధువు ఉత్తి పిచ్చివాడులా ఉన్నాడు. ఇంత సంపదను చూచి మృత్యువన్నాడేమిటి?" అనుకున్నారు. 'ఎలాగైతేనేం-మనకు మహానిధి దొరికింది. అంతేచాలు' అని సంతోషించారు. దాన్ని ముగ్గురూ సమానంగా పంచుకుందాం అనుకున్నారు. మరి ధనమేమో చాలా ఉంది. జేబుల్లోనూ ఉత్తరీయంలోనో పెట్టుకొనేందుకు వీల్లేనంత ఎక్కువ ఉంది. ఎలా మోసుకుపోవటం? ఒకడన్నాడు "ఒరేయ్! ఎవరమైనా ఒకళ్లం ఊళ్లోకి వెళ్లి సంచులు తెచ్చుకుందాం. ఇవన్నీ లెక్క పెట్టి పంచుకొనేప్పటికి చాలా సమయం పడుతుంది. మనం మధ్యాహ్నం వేళకే తిరిగి వెళ్లిపోదామనుకొని చద్ది తెచ్చుకోలేదు గదా! అందుకని అన్నం కూడా

తెచ్చుకుందాం". మిగిలిన వాళ్లు సరేనంటే సరేనన్నారు. ముగ్గురిలో చిన్నవాడు ఊళ్లోకి వెళ్లి మూడు గోనెసంచులు, అన్నమూ తేవాలని నిర్ణయమైంది. సరే-వాడు వెళ్లాడు. మిగిలిన వాళ్లిద్దరూ రత్నాలరాశి ముందు కూర్చొని మూడు కుప్పల క్రింద పేర్చసాగారు. అవి ఒక్కొక్కటి కోట్ల రూపాయల విలువ చేసే అమూల్య రత్నాలు. వాటిని తమ చేతులతో తాకటమే విచిత్రంగా ఉంది కట్టెల వాళ్లకి. అంతలో ఒకడన్నాడు గదా-

"ఒరేయ్! ఇంత అంతులేని సంపదలో చిన్నాడి క్కూడా వాటా పెట్టాలంటావా?"

"ముగ్గురం పంచుకుందామనుకున్నాంగా మరి!" ఇంకొకడన్నాడు "అనుకున్నానమనుకో! వాడికి లేకుండా మనం యిద్దరమే పంచుకుంటే చాలా చాలా వస్తుంది మనకి".

"నిజమేననుకో! మరివాడు వస్తాడుగా యిప్పుడు" "వస్తే రానీ- దానికి ఉపాయం చెప్తాగా!".

చిన్నాడు రాగానే ఇద్దరూ కలసి గొడ్డళ్లతో వాడి మెడ నరికేసి శవాన్ని తుప్పల్లో పాతిపెట్టాలని నిశ్చయించుకున్నారు చివరికి.

ఇక-మన చిన్నాడు ఇంటికి వెళ్లి, భోజనం చేసాడు. తల్లిని అడిగి మిగిలిన యిద్దరికీ భోజనం తీసుకున్నాడు. సంచులు కట్ట కట్టుకున్నాడు. ఇక తిరిగి అడవికి నడుస్తున్నాడు. అంతలో అతనికి ఒక ఆలోచన వచ్చింది. "గుహలో అంతులేనంత సంపద ఉంది. వాళ్లిద్దరూ పెద్దవాళ్లు, ఇక అట్టే కాలం బ్రతకరు, వాళ్లేం చేసుకుంటారు ఆ సంపదంతా! తనకొక్కడికే అదంతా దక్కితే ఎంత బాగుంటుంది! మెల్లగా వాడి తలలో పురుగు తొలిచినట్లు తొలవసాగింది యీ దుష్టాలోచన. వాడొక పాములవాడి దగ్గరకు వెళ్లి నల్లత్రాచు విషం కొని భోజనంలో కలిపేసాడు.

తనకు దక్కబోయే సంపదను గూర్చి కలలుగంటూ చిన్నాడు గుహ లోపలికి అడుగుపెట్టాడు. గొడ్డళ్లతో సిద్ధముగా ఉన్న మిగిలిన యిద్దరూ





వాడి మీద పడి తలనరికేసారు. గబగబ శవాన్ని ఒక చెట్టు క్రింద పాతేసారు. దగ్గరలో ఉన్న మడుగులో స్నానాలు చేసారు. సంతోషంతో తిరిగి వచ్చారు. రత్నాలు, బంగారం వైపు చూస్తూనే చిన్నాడు తెచ్చిన అన్నం తిన్నారు. పది నిముషాల్లో వాళ్లకు తలతిరగటం నోట్లోంచీ రక్తం రావటం ప్రారంభమైంది. విషప్రభావానికి వాళ్లిద్దరూ చచ్చిపడ్డారు ఆ ధనరాసుల ముందే. పోయే ముందు వాళ్లకు గుర్తువచ్చింది-సాధువు 'మృత్యువు, మృత్యువు' అని కేకలు పెట్టటం "అవును-మనది కాని సంపద మనకు మృత్యువే! అనిపించింది వాళ్లకు ఆ చివరి క్షణంలో.



# భరతుడు

– పూర్ణిమ

(భగవత్త్రేమ పొందటంలో నిర్ణిద్రమైన సాధన ఉండాలి. సాధనలో భక్తి జ్ఞానంగా పరాకాష్ట చెందితే ధ్యాత, ధ్యేయం, ధ్యానం ఒక్కటై ధ్యాతే ధ్యేయంగా మారిపోతాడు. దానికి కావలసిన నిత్య స్మరణ - అనుసరణ, నిరంతర స్ఫురణే. చదవండి)

కనుల నిండా నీటితో తలవంచుకున్నాడు భరతుడు. ఎదురుగా నిలబడిన యీ అన్నగారు రామచంద్రుడంటే తనకు ఎనలేని ప్రేమ, గౌరవం చిన్ననాటి నుంచీ కూడా. కానీ, లక్ష్మణుడిలాగ చేరువగా ఉండలేకపోయాడు. మేనమామల ఇండ్లలో పెరగటం చేత కొంతా, "పెద్దన్నగారు" అనే బెరుకు వలన కొంతా ఒక అడుగుదూరంలోనే ఆగిపోయేవాడు తాను. చిన్నప్పడు లక్ష్మణుడిలాగే పరుగున వెళ్లి అన్న గుండెలకు హత్తుకుపోవాలనిపించినా-ఏదో గౌరవం అక్కడే ఆపేసేది. పెరిగి పెద్దయ్యాక కూడా అన్న పాదాలకు నమస్కరించేటపుడు ఆ పాదాలు గట్టిగా నిమరాలనీ వాటిపై తలవాల్చి అలాగే ఉండిపోవాలనీ అనిపించినా-అంతటి సుకుమార కమలాలు అన్న పాదాలు నలిగిపోతాయేమోనన్నట్లు మృదువుగా స్పృశించటంలోనే తృప్తిపడేవాడు. ఇక .... యిప్పుడు :

భరతుడికి కన్నీళ్ళు కాలువలైనాయి. ఎంత దౌర్భాగ్యుడు తాను తన జన్మ శ్రీరాముల కష్టానికి హేతువైంది. తానంటూ పుట్టి ఉండకపోతే తన తల్లి కైకేయి అంతటి క్రూరమైన కోరిక కోరి ఉండదు గదా! తన ప్రియతమ సోదరుడు ఈ కఠిన కానన సీమలలో యిలా జీవించవలసిన అగత్యం తనవలననే గదా! తండ్రిగారు పుత్రశోకంతో కాలం చేయటం కూడా .....”

శ్రీరామునికి భరతుని మనో సంచలనం అర్థమైంది. తాను ఈ తమ్ముడిని అంచనా వెయ్యటంలో ఎప్పుడూ పొరబడలేదు. తాను తోటలో కూర్చున్నా, నడుస్తున్నా, తండ్రిగారి ఆజ్ఞపై రాజ్యసభలో కూర్చున్నా కోటి కలువల మీద క్రుమ్మరిస్తున్నట్లుగా భరతుని ప్రేమమయమైన మెత్తని చూపులు తనను అల్లుకునే ఉండేవి. పినతల్లిగారు భరతుని రాజును చెయ్యాలని వరం కోరిందని వినగానే తనకు ఆమెపై కన్నబిడ్డ మనసు గుర్తించలేకపోయెనే అని జాలి వేసింది. ఈ వార్త విని భరతుడు ఎంత అల్లాడుతాడోనని బాధ కలిగింది. ఈ పిచ్చి తండ్రి జరిగిన వాటికన్నిటికీ తానే కర్తననుకుంటున్నాడు. శ్రీరామునికి భరతునిపై కరుణ, ప్రేమ పొంగి వచ్చాయి. చేతులు చాపాడు.

ఒక్క ఉదటున వచ్చి అన్నగారి చేతులలో వాలిపోయాడు భరతుడు. రాముని చెయ్యి అతని వీపును, శిరస్సును లాలనగా నిమిరింది. కుమిలి కుమిలి ఏడుస్తున్న అతని చెక్కిళ్ళపై కన్నీటిని తుడిచింది. పోయిన తండ్రిగారిని తలచుకొని అన్నదమ్ములిద్దరూ దుఃఖించారు. కొంతసేపటికి సాంత్వన చెందారు. ఇదంతా కన్నీటితో చూస్తున్నాడు లక్ష్మణుడు దూరంగా వస్తున్న భరతుడినీ, పరివారాన్నీ చూడగానే తనకు కోపం వచ్చింది. అన్నగారికేదో కీడు చేయటానికే అతను వస్తున్నాడని మండిపడుతూ ధనుర్బాణాలు తీసుకొని బయలుదేరాడు. అన్నగారు తనని ఆపుతూ “భరతుడి హృదయం నీవు తెలుసుకోలేకపోతున్నావు లక్ష్మణా! అతడు నీకన్నా తక్కువేమీ ప్రేమించడు నన్ను” అన్నారు. తనకు నమ్మకం కలగలేదు. పైగా “నీ





కన్నా తక్కువగా ఏమీ అన్నారని మనసు చివుక్కుమన్నది కూడా. కానీ, అన్నగారికి ఎదురాడే అలవాటు లేదు గనుక మౌనంగా ఉండిపోయాడు.

రాముని పాదాలవంటి ప్రార్థిస్తున్నాడు భరతుడు. ఆయన లేని రాజ్యంలో తానుండలేనంటున్నాడు. తనను దయతలచమంటున్నాడు. తిరిగి రమ్మని సుమంతాది పరివారం వేడుకుంటున్నారు. రాముడు చిరునవ్వుతో అందరినీ కలయజూచాడు. “నేను తండ్రిగారు చేసిన బాస ప్రకారం వారి ఆజ్ఞ పాలించడానికే యీ వనసీమలకు వచ్చాను. ఇప్పుడు మీరంతా వెనుదిరగమంటున్నారు. సరే-భరతుడు రమ్మంటే వస్తాను” అన్నాడు. అందరూ ఉత్కంఠతో భరతునివైపు చూచారు. లక్ష్మణుడు కూడా ఎంతో ఆసక్తిగా చూస్తున్నాడు. అతడొక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు మౌనంగా. అటుపైన నేలకు తల ఆన్చి నమస్కరించాడు. “తమ పాదుకలు నా శిరస్సున ఉంచి తీసుకువెళ్ళి అయోధ్యా సింహాసనంపై ప్రతిష్ఠించేందుకు అనుమతివ్వండి. నేను నందిగ్రామంలోనే ఉండి తమ తరఫున రాజ్యపాలన చేస్తాను. నా కర్తవ్యం సరిగా పాలించగలిగేలాగా ఆశీర్వదించండి ప్రభూ!” అన్నాడు దోసిలొగ్గి నిలచి.

లక్ష్మణుడికి ఒళ్ళు పులకరించింది. అన్నగారు చెప్పింది నిజమే. ఈ భరతుడు చాలా గొప్పవాడు. తానొక్కమాట “రండి” అంటే తిరిగివస్తాడు రామన్న. కానీ, ఆయన ఎంచుకున్న ధర్మదీక్షను భగ్నం చేసినట్లవుతుంది. అది రామునికి బాధ కలిగిస్తుంది. అంతకన్నా తాను పదునాలుగేళ్ల దీర్ఘ కాలం రామవియోగాన్నీ దుఃఖాన్నీ భరించటమే మంచిదనుకున్నాడు భరతుడు. లక్ష్మణుడు కనులనిండా ప్రేమనింపుకొని భరతునివైపు చూచాడు. అయినా అతని మనసులో చిన్నముల్లు ఇంకా గుచ్చుకొంటూనే ఉంది- “నీకన్నా తక్కువేమీ ప్రేమించడు”. ఆ మాట అతనికి జీర్ణం కావటం లేదు.

రాముడు భరతుడిని ఆశీర్వదించి పాదుకలిచ్చాడు. పరివారం పలికే జయజయధ్వానాల మధ్య రామపాదుకలు భరతుని శిరస్సునలంక

రించాయి. తల్లినెడబాసిపోయే గోవత్సంలాగా తడబడే కాళ్లతో నడిచాడు భరతుడు. మెల్లమెల్లగా అందరూ నందిగ్రామంవైపు సాగిపోయారు. తిరిగి సీతారామలక్ష్మణులే పర్ణశాల ముందు మిగిలారు.

పద్నాలుగేళ్ల సుదీర్ఘకాలం గడిచిపోయింది. ఎన్నో పరీక్షలు. ఎన్నో దుఃఖాలు-ఎన్నెన్నో సమస్యలు-సీతాపహరణం-మహాయుద్ధం. రాక్షస సంహారం-విజయం. ఇన్ని నాళ్లలోనూ భరతుడు అడవిలోనూ అడుగు పెట్టలేదు, అయోధ్యలోనూ అడుగుపెట్టలేదు. అన్నగారికి సాయంగా యుద్ధానికి వచ్చే ప్రయత్నం కూడా చేయలేదు. రామరాజ్యాన్ని జాగ్రత్తగా పాలిస్తూ, న్యాసధనాన్ని కాపాడినంత పదిలంగా కాపాడుతూ ఉన్నాడు. ఈ పద్నాలుగేళ్లూ లక్ష్మణుడు సామాన్య మానవాతీతమైన భక్తిశ్రద్ధలతో సీతా రాములను సేవిస్తూ వచ్చాడు. పొరపాటుగానైనా కన్నుమూసి నిదురించ కుండా నిర్నిద్రమైన ప్రేమార్ద్ర హృదయంతో సంచరించాడు. అన్నేళ్ళూ అతని మనసులో ఒకే ఆలోచన "నీకన్నా తక్కువేమీ ప్రేమించడు" అన్నారే అన్నగారు నా ప్రేమ సర్వశ్రేష్ఠమైనది కాదన్నమాట. అంటే నా ప్రేమలో యింకా లోపం ఉందన్నమాట! ఎక్కడ! అదే ఆలోచనతో తన చర్యలు, మాటలు అన్నీ ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ ఉండేవాడు లక్ష్మణుడు. అతనికి అయోధ్యలో విడచివచ్చిన తల్లి సుమిత్ర గురించిగానీ భార్య ఊర్మిళను గూర్చిగానీ చింతలేదు. ఉన్నచింతల్లా - అన్నగారిని యింకా ఎలా ప్రేమించడం? అనే!

ధర్మదేవత ఎదురుచూచిన ఆ శుభదినం-శ్రీరామచంద్రుడు వన వాసాన్ని విడచి అయోధ్యకు మరలిపోయే క్షణం రానేవచ్చింది. కోసల రాజ్యం అంతటా ఆనందం వెల్లివిరుస్తోంది. పుష్పక విమానం పొలిమేర లలో ఆగింది. తమ ప్రభువును, తమ స్వామిని, తమ ఏలుగడను తోడ్కొని పోవడానికి జనసందోహం బారులు తీరివచ్చింది. అందరికన్నా ముందు భరతుడు! రాముడు అతన్ని చూస్తూనే చేతులు చాచాడు. గాఢపు కౌగిలిలో అన్నగారి ఎదకు హత్తుకుపోయిన భరతుడు తల్లి కౌగిట చేరిన శిశు





వుగా మారిపోయాడు.

కొద్ది క్షణాలు గడిచిపోయాయి. అన్నదమ్ములు ఒకరి ఎదురుగా ఒకరు నిలచి ఆప్యాయంగా చూపులతోనే ఒకరినొకరు తడుముకుంటున్నారు. లక్ష్మణుడు చకితుడై నిలచిపోయాడు. తన ఎదుట నిలిచిన ఆ ఇరువురిలో ఎవరు రాముడు, ఎవరు భరతుడు? ఇద్దరూ కృశించిపోయి ఉన్నారు. ఇద్దరి కన్నులలోనూ యోగదీప్తి మెరుస్తున్నది. ఇద్దరి శరీరాలపైనా నార చీరలే. ఇద్దరి ముఖాలలోనూ ఒకే ప్రసన్నత, ఒకే ప్రశాంతత : ఒకే రూపు రేఖలు - ఒకే దుస్తులు, ఒకటే తీరు! ఎవరు రాముడు-ఎవరు భరతుడు.

లక్ష్మణునికి తన పద్నాలుగేళ్ల ప్రశ్నకు సమాధానం దొరికినట్లయింది. అవును-నిస్సందేహంగా భరతుడు తనకన్నా ఎక్కువగా అన్నగారిని ప్రేమిం చాడు. తాను రాముడిని విడిచి ఉండలేక ఆయన వెంటబడి అడవులకు వెళ్లాడు. శరీర శ్రమను లెక్కచేయకుండా అహర్నిశలూ ఆయనను సేవించాడు. కానీ, తానున్నది రామసన్నిధిలో, ఆయన చూపే, స్పర్శే, సాన్ని ధ్యమే తనకు ఎట్టి అలసటా, విచారమూ కలగకుండా చేసాయి.

భరతుడు రామునికి దూరమయ్యాడు. రాముని రాజ్యాన్ని తాను పాలిస్తున్నానన్న భావనతోనే పనిచేసాడు. తాను చేసే సమస్త కార్యాలూ భగవత్కార్యాలేనని భావిస్తూ నిష్కామకర్మ చేసే భక్తుడిలాగా భరతుడు ప్రవర్తించాడు. రామునిలాగే తానూ కటిక రాతిపై పవళించాడు. తానూ కందమూలాలే తిన్నాడు. నారచీరలే ధరించాడు. క్షణక్షణమూ రాముని స్మరణతోనే, రామకార్యం చేస్తూ గడిపాడు. ఆ నిత్యస్మరణ వలన సాక్షాత్తు పరమాత్ముడైన రామచంద్రుడినే తనలో ఆవాహన చేసుకోగలిగాడు భరతుడు. అందుకే పూర్తిగా రామ లక్షణాలన్నీ భరతునిలో కనిపిస్తున్నాయి. ఎంతటి ధన్యుడు! లక్ష్మణుని కనులనిండుగా నీరు. గుండెనిండా భరతునిపై ప్రేమ. "ధన్యుడవోయి తపస్వీ!" అనుకున్నాడు ఆర్ద్రంగా. భరతుడిని చూపుల తోనే స్పృశిస్తూ.

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

తన సర్వస్వమును బాబాకే సమర్పించి అరిషడ్వర్గములను అవలీలగా జయించిన పుణ్యమూర్తి మన పూజ్య స్వామీజీ. ఆయన ఎల్లవేళలా బాబా సేవ తప్ప దేనిపైన ధ్యాస ఉండెడిది కాదు. ఆయనకు ధనముపై ఏమాత్రము ఆశ ఉండెడిది కాదు. ఆయనే ధనమందు ఆశ ఉంటే దక్షిణ ధనంతో షిరిడీనే కొనగల స్థితిమంతుడయ్యేవారని ఐదు దశాబ్దముల నుంచి స్వామీజీతో పరిచయ భాగ్యమున్నవిన్ని చిట్లూరి గారు తెలియజేసెను.

**అవధూతల దర్శన భాగ్యము :**

అవధూతల పట్ల స్వామీజీకి అత్యంత భక్తిశ్రద్ధలు గలవు. అవధూతలు దేవుని యొక్క ప్రతిరూపాలని చెప్పేవారు. వారు కల్లాకపటము తెలియని పసిపిల్లలతో సమానమనియు, వారి మనస్సు నవనీతముకన్నా మృదువనియు, ఈ సృష్టిలో గల ప్రతి ప్రాణిలోను వారు భగవంతుని గాంచుదురనియు, వారి మనస్సులో "చెడు" అన్న పదమునకు చోటే ఉండదనియు చెప్పెడివారు.

స్వామీజీ సత్సంగము నిర్వహించేటప్పుడు రమణ మహర్షి, రామకృష్ణ పరమహంస, నిత్యానంద బాబా, విదేహి సతీ అనసూయ మాత, దేవి మాయమ్మ, నాంపల్లి బాబా, రామిరెడ్డి తాత, వెంకయ్య స్వామి మొ॥ అవధూతల లీలలను తెలిపెడివారు.

ఒక పర్యాయము బాబా ద్వారకామాయి ఛాయాచిత్రము రామిరెడ్డి తాతకు పంపగా తాత భక్తులు ఆ చిత్రపటమును రైల్వేస్టేషన్ నుంచి సుందరముగా నలంకరించిన ఒక ట్రక్కులో నుంచి తీసుకువెళ్ళుచుండ తాత గ్రామ సరిహద్దుల వరకు ఎదురునడచి వచ్చి ఆ ట్రక్కులో ముందు





సీటులో ఆశీనుడై గురుస్థానము చేరగనే అందరికంటే తానే ముందుగా ట్రక్కులో నుంచి దిగి బాబా ఛాయాచిత్రమును గురుస్థానములో తన స్వహస్తములతో నుంచెను. నేటికిని తాత ఆశ్రమములో ఈ చిత్రరాజము భక్తులచే నిత్యపూజలందుకొనుచున్నది. తాత యొక్క ఈ చర్య ఒక అవధూతను మరియొక అవధూతయే అర్థము చేసుకొనగలడని నిరూపిస్తున్నది.

1992వ సంవత్సరములో తాతను ఆయన భక్తులు షిరిడీకి తీసుకు వెళ్ళగా స్వామీజీ తాతకు గ్రామోత్సవము జరిపించెను. బాబా తరువాత షిరిడీలో గ్రామోత్సవము జరిపించుకున్నది తాతగారే.

స్వామీజీ ఎల్లప్పుడు అవధూతల చేత మందిర నిర్మాణములు, విగ్రహ ప్రతిష్టలు గావించమని ఆయన భక్తులకు చెప్పెడివారు. హైదరాబాద్‌లోని కబూతర్ ఖానా మందిరములో విగ్రహ ప్రతిష్ఠ రామిరెడ్డి తాత చేతను, మల్లాపూర్‌లోని ద్వారకామాయి ఆవిష్కరణ విదేహి సతీ అనసూయ మాత చేతుల మీదగాను జరిపించెను. తానే ఒక అవధూత అయ్యుండియు మరొక అవధూత పట్ల ఎంతో వినయవిధేయతలతో మెలగెడివారు మన స్వామీజీ.

విదేహి సతీ అనసూయ మాత షిరిడీ వచ్చినప్పుడు స్వామీజీ ఆమె పాదములపై తన శిరస్సునుంచి నమస్కరించెను. ఏనాడును షిరిడీ పొలిమేరలు దాటకున్నను సమకాలీన అవధూతల ఆశీర్వాదములు, దర్శన భాగ్యమును పొందిన పుణ్యమూర్తి మన స్వామీజీ.

పై సంఘటనలు బాబా దర్శనార్థమై షిరిడీకి విచ్చేసిన గజానన మహారాజ్, అవతార్ మెహర్ బాబాలను మనకు గుర్తుకు తెస్తున్నవి.

**మహా సమాధి :**


అది జనవరి నెల 1996లో స్వామీజీ భక్తులలో ఒకరికి కాన్సర్ సోకినది. వైద్యులు కూడ పరీక్షించి నిర్ధారించినారు. వారం రోజులలో

అతని వ్యాధి తగ్గి కొంచెము దగ్గుతో బాధపడినాడు. అటు తరువాత రెండు, మూడు రోజులలోనే పూర్తి ఆరోగ్యవంతుడయ్యెను. వెంటనే స్వామీజీ అనారోగ్యముతో బాధపడుచుండ భక్తులందరు బలవంతముగా హాస్పిటల్‌కు తీసుకువెళ్ళగా వైద్యులు పరీక్షించి కాన్సర్ అని నిర్ధారించినారు. స్వామీజీ మరి కొన్నిరోజులు జీవించి ఉండాలంటే వెంటనే బొంబాయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాన్సర్‌కు తీసుకువెళ్ళమని సలహానిచ్చిరి. స్వామీజీ షిరిడీ పొలిమేరలు దాటుటకు అంగీకరించక "బాబా నాచే మరికొంతకాలం సేవ చేయించుకోవాలనుకుంటే ఆయనే నా వ్యాధిని తగ్గిస్తాడు" అని దృఢముగా సమాధానమిచ్చెను. ఈ సంగతి ఆ నోట ఆనోట భక్తులందరికి తెలిసి స్వామిని చూడటానికి తండోపతండములుగా వచ్చిరి. భక్తుల అలజడికి దూరంగా ప్రశాంత వాతావరణములో నుండదలచిన స్వామీజీ 25.01.1996న గోరాడియా హోటల్ ప్రక్కనే గల పోస్టుమాస్టర్ నాగరే గృహము ఖాళీగా నుండుటచే తనకు అక్కడ బసనేర్పాటు చేయమని భక్తులకు సూచించగా అదేరోజు స్వామిని అక్కడకు తరలించినారు. అట్టి విపత్కర సమయమందు కూడ తన పనులన్నీ తానే స్వయముగా చేసుకొనుచు బాబా తీర్థమును మాత్రము సేవించుచు సాయి నామ స్మరణలోనే కాలమును గడిపెను. అంతటి విషమ పరిస్థితులలోను ఆయన బాబా యందు గల విశ్వాసము కించెత్తు కూడ సడలలేదు. అన్న పానీయములను త్యజించి క్యారెట్ రసం, బాబా పాదోదకంతోనే కాలం గడిపిరి. తన బాధను ఏమాత్రము బయటకు వ్యక్తపరచకపోగా అధైర్యపడుచున్న భక్తులకు ధైర్యము చెప్పిరి. స్వామీజీ తనకు భక్తులు సమర్పించిన శాలువాలను, రగ్గులను అందరికీ వితరణ చేసిరి. స్వామీజీ తన చివరి ఘడియలలో సహితం సాటివారికి చేతనైన సాయమందించి మనందరికీ ఆదర్శప్రాయులైనారు.

**(సశేషం)**







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

**ఐదవ సంకటం :** ఒకసారి దాసగణు మహాత్ముల చరిత్ర వ్రాసే ప్రక్రియలో భాగంగా శ్రీ నరసింగ మహారాజ్ అనే మహాత్ముని గురించిన వివరాలు సేకరించేందుకు "అకోట" అనే గ్రామం వెళ్ళాడు. ఎప్పటి మాదిరిగానే అధికారికంగా సెలవు తీసుకోకుండా, తాను ఏదో ఒక కేసు విచారణ నిమిత్తమై పర్యటిస్తూ, మధ్యలో "అకోట" వెళ్ళిపోయాడు, ఇంతలో నెవాసా పోలీసుస్టేషన్ పరిధిలోని "బాల్గావ్" అనే గ్రామంలో దోపిడీదొంగలు ఒక మార్వాడీని హత్య చేసి, పెద్ద మొత్తంలో డబ్బు, బంగారం దోచుకున్నారు. ఆ కేసు నిమిత్తమై పోలీసుల హడావుడి మొదలైంది. కానీ, స్టేషనులో ముఖ్య సిపాయి అయిన గణపతిరావ్ కనపడకపోవటం చూసి, ఆంగ్లేయ అధికారి అయిన వార్డెన్ సాహెబ్ "గణపతి రావుని అత్యవసరంగా పిలిపించండి" అని హుకుం జారీ చేసాడు. "గణపతిరావు బేలాపూర్ స్టేషన్‌కి వెళ్ళాడు. కానీ, ప్రస్తుతం అక్కడ లేడు. ఎక్కడకు వెళ్ళాడో సమాచారం లేదు" అనే వర్తమానం అందింది. అంతే, వార్డెన్ సాహెబ్ కోపం నషాళానికి అంటింది. "తాను ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎక్కడకు వెళ్ళాడో తెలుసుకోండి" అని ఆదేశించాడు.

"అకోట" గ్రామం నుండి భేలాపూర్‌కి తిరిగి వచ్చిన దాసగణుకు, విషయమంతా తెలిసింది. "తాను అనధికారికంగా వెళ్ళినందుకు ఉద్యోగం పోవడం ఖాయం. కనుక ఈ క్లిష్ట పరిస్థితి నుండి గట్టెక్కాలంటే ఏదో ఒకటి చేయాలి" అని అనుకుంటూ తిరుగుప్రయాణం అయ్యాడు. ప్రయాణం చేస్తున్న సమయంలో దాసగణుకు "నీవు పశ్చాత్తాపపడతావు" అని బాబా చేసిన హెచ్చరిక గుర్తుకు వచ్చింది. దారిలో గోదావరి నది

వస్తుంది. సుమారు అర్ధరాత్రి ఒకటిన్నర ప్రాంతంలో దాసగణు అక్కడకు చేరుకున్నాడు. అప్పుడు గోదావరి నదిలోకి దిగి, దోసిళ్ళతో నీళ్ళు తీసుకొని శిరిడీ వైపు చూస్తూ "బాబా, ఈ సంకటం నుండి నేను క్షేమంగా బయట పడితే కచ్చితంగా ఉద్యోగం వదిలేస్తాను. గంగామాత సాక్షిగా మీకు మాట ఇస్తున్నాను" అని ప్రార్థిస్తూ నీళ్ళు వదిలాడు. తరువాత తన తిరుగు ప్రయాణం కొనసాగించాడు. ప్రార్థించిందే తడవుగా బాబా అనుగ్రహించడంతో దాసగణు ఏమాత్రం ఊహించని అద్భుతం జరిగింది. చీకటిగా నుండటంతో-సాయి సంకల్పానుసారంగా - గుర్రం దారితప్పి "బాద్‌రాణా" అనే గ్రామానికి వెళ్ళింది. సుమారు తెల్లవారుఝాము ప్రాంతంలో ఆ గ్రామ శివార్లలోని చావడి వద్దకు చేరుకోగానే, ఎవరో పెద్దగా అరుచుకుంటున్నట్లుగా వినిపించింది. దగ్గరకు వెళ్ళి ఆలకిస్తే "నేను మార్వాడీని చంపాను కాబట్టి, నాకు ఎక్కువ వాటా రావాలి" అని ఒకరు, "నేను ఇనప్పెట్టెను పగలకొట్టాను. కాబట్టి నాకు ఎక్కువ వాటా రావాలి" అని ఒకరు ... అలా కొందరు వాదించుకొంటున్నారు. దాసగణుకి పరిస్థితంతా అర్థమైంది. నిశ్శబ్దంగా అక్కడనుండి నిష్క్రమించి, ఆ గ్రామ పటేలు వద్దకు వెళ్ళి, విషయమంతా చెప్పి, ఆయన సహాయంతో దొంగలందరినీ దోపిడీ చేసిన సొత్తుతోసహా పట్టుకున్నారు. ఇక్కడ నెవాసాలో "ఆ దొంగలను పట్టుకోవడం ఎలా?" అని పోలీసులు తలపట్టుకొని కూర్చొంటే, ఆ దొంగలను మరియు దోపిడీ సొమ్మును తీసుకొని దాసగణు నింపాదిగా స్టేషనులో అడుగు బెట్టాడు. జరిగినదంతా విని వార్డెన్ సాహెబ్ దాసగణును "శభాష్" అని మెచ్చుకొని, దాసగణుకు వెంటనే పదోన్నతి కల్పించాలని సిఫారసు చేస్తూ పై అధికారులకు లేఖ వ్రాసాడు.

తాను పరితపిస్తున్న పదోన్నతి ముందర నిలబడి ఊరిస్తుండటంతో, దాసగణు గోదావరి సాక్షిగా బాబాకు ఇచ్చిన మాటను నిర్లక్ష్యం చేసాడు. తరువాత తాను షిరిడీకి వచ్చినప్పుడు బాబా **"గణూ, గంగను చేతిలోకి తీసు**





**కొని ఉద్యోగం వదిలేస్తానని ఎవరు ప్రమాణం చేసారు? ఇప్పటికయినా కళ్ళు తెరువు"** అని అన్నారు. దాసగణు ఎప్పటి మాదిరిగానే మాట దాటవేసి, అక్కడ నుండి నిష్క్రమించాడు.

అర్ధరాత్రి గోదావరి నదిలో ఒంటరిగా నిలబడి చేసిన ప్రమాణాన్ని ప్రస్తావించడం ద్వారా బాబా తమ సర్వాంతర్యామిత్వాన్ని ప్రస్ఫుటింపజేసారు. నిజానికి దాసగణు ఆ విషయాన్ని గుర్తించలేని అమాయకుడు కాదు. సర్వ చిత్తచాలకుడు, సకల లోకపాలకుడు అయిన ఆ సద్గురుడే **"నీకు ఆ పదోన్నతి రాదు"** అని స్వయంగా పలికినా, ఆ మాటను పెడచెవిన పెట్టి, అపార పారమార్థిక పరిజ్ఞానం కలిగిన దాసగణు కేవలం ప్రాపంచికమైన చిరు పదోన్నతి కోసం ప్రాకులాడటం చూస్తే, మనసు చేసే మాయ యొక్క ప్రభావం ఎంత బలంగా ఉంటుందో మనం అర్థం చేసుకోవచ్చు. కానీ, ఆ మనసుకు ముక్కుతాడు వేసే ప్రక్రియను ఆ సద్గురువు మొక్కవోని రీతిలో కొనసాగించి, తమదైన శైలిలో తమ దారికి తెచ్చుకుంటారు. దాసగణు విషయంలో బాబా సరిగ్గా అలాగే చేసారు.

**చివరి సంకటం :** ఒకసారి నెవాసా పోలీసు ఇన్సెపెక్టర్ వ్యక్తిగత పని మీద సెలవు పెట్టి స్టేషన్ బాధ్యతను దాసగణుకి అప్పజెప్పాడు. అలా దాసగణు స్టేషన్ బాధ్యతను చూసేటప్పడు "స్టేషన్ చూసుకోమని" సహచర సిపాయికి చెప్పి, ఏదో పని మీద బయటకు వెళ్ళాడు. అప్పుడు ఒక గ్రామ మునిసిఫ్ తన బంట్రోతు ద్వారా స్టేషనులో జమ చేయవలసిన జరిమానా సొమ్మును (రూ.32/-) పంపాడు. ఆ డబ్బులను దాసగణు సహచార పోలీసు స్వాహా చేసాడు. తరువాత ఆ గ్రామం నుండి జరిమానా సొమ్ము అందకపోవడంతో ప్రభుత్వం ఆ గ్రామ మునిసిఫ్ మీద వారెంట్ విడుదల చేసింది. అప్పుడు ఆ గ్రామ మున్సిఫ్ ఫలానా రోజు, తన బంట్రోతు ద్వారా స్టేషన్‌లో డబ్బును జమచేసానని ప్రభుత్వానికి నివేదించాడు. విషయమేమిటో నిగ్గు తేల్చమని ప్రభుత్వం విచారణాధికారిని నియమించింది.

**(సశేషం)**

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

అక్రూరుల వారుపదేశించిన మంత్రమే వారికి ప్రాణధారకమైంది.

హే కృష్ణ గోవింద హరే మురారే  హే నాథ నారాయణ వాసుదేవ

ప్రతి స్త్రీ గుండెలో ఆ పరమేశ్వరుని చూడడానికి, ఆయనకు తమ సర్వస్వాన్ని సమర్పించుకోడానికి తపన ప్రారంభమైంది. అహర్నిశలు, ఏ పని చేసేటప్పడైనా ఆ స్తుతి అలా లోలోన నడుస్తూనే ఉండేది.

హే కృష్ణ గోవింద హరే మురారే  హే నాథ నారాయణ వాసుదేవ

'తండ్రీ! గోవిందా! వాసుదేవా! రావయ్యా ప్రభూ! వచ్చి ఈ దీనురాండ్రను కాపాడు ప్రభూ! మాకింకెవరయ్యా దిక్కు! ఇహ ఈ జీవితాన్ని గడపలేము శ్రీనాథా!' లోలోపల పదహారు వేల ఒక వంద స్త్రీలు, వేలాది శ్రోత్రియులు అహర్నిశలు శ్రీకృష్ణుని సర్వ శరణ్యభావనతో ప్రార్థించడం ప్రారంభమైంది. పెదవులు కదలవు, మాటలాడవు, లోపల వెలుగు కవాటాలు తెరుచుకుంటున్న గురుతు వారి నడకలో, ముఖంలో కన్పిస్తుండేది.

ద్వారక నుండి వెడలినప్పటినుంచే శ్రీకృష్ణుడు సత్యభామను ఈ పదారువేల ఒక వంద స్త్రీల విషయంలో ఆలోచించడానికి పురికొల్పుతూ వచ్చాడు.

'సత్యా! పాపం ఆ స్త్రీలు ఎన్ని బాధలనుభవిస్తున్నారో!'

'అవును స్వామీ! వారి దుఃఖాన్ని ఎవరు తీర్చగలరు! నన్ను అదే బాధ వేధిస్తున్నది ప్రభూ'.

కృష్ణునికి  ఈ ప్రయాణం అనేక సమస్యలను దారితీసింది.

'కృష్ణా! నీవు ఒంటరిగా ఈ ప్రమాదాన్ని ఎదిరించడం నాకు ఇష్టం లేదు. నేను కూడా వస్తాను. దారిలో మనను అభిమానించే రాజన్యుల





సహకారం కూడా తీసుకుందాం' అని బలరాముడు తిరిగి పట్టుదల చూపాడు. ఆయనకు ఎప్పడూ తమ్ముని వెంట ఉండాలనే కోరిక.

కృష్ణుడు 'అన్నా! మీరు వెంట వస్తానంటే నాకింకేమి కావాలి. నరకుడు రాక్షసుడు. స్త్రీలనందరినీ నిర్ధాక్షిణ్యంగా నిర్బంధించి వుంచిన ఆతతాయి. అనేకమంది చిన్న చిన్న రాజులను ఓడించి, వారిని చంపి, వారి కపాలాలతో తన సభాంగణాన్ని అలంకరించుకున్నాడట. మనం ఆర్భాటంగా వెళితే వాడు ఆ ఆర్తురాండ్రను పదారువేల మందిని ఏమైనా చేయవచ్చు గదా! మనం గోమంతకంలో చేసినట్లే హఠాత్తుగా దాడిచేసి, వాణ్ణి ముందు సంహరించాలి. నీ ప్రోత్సాహంతో సమకూర్చుకున్న ఈ చక్రమే ఆ పని చేస్తుంది' అని భవిష్యత్తును శాసిస్తున్నట్లు అని, 'అన్నా! ఆ ఆడవారిని విడిపించిన తరువాత వారి గతేమవుతుంది? ఇది మనం తప్ప మరెవరు పరిష్కరించగలరు? నేను వెళ్లిన తరువాత ఏదైనా అవసరమేర్పడ్డప్పడు, వెనుక నుంచి సహాయం సమకూర్చే వారెవరు?' అని అడిగాడు.

అప్పటివరకు ఈ సంభాషణ వింటూన్న గర్గాచార్యులు నిజమేనన్నట్లు తల పంకించి 'నిజమేనయ్యా! వారిని విడిపించడమనేది ఒక ప్రశ్నైతే, వారి భవిష్యత్తు మరో ప్రశ్న. కృష్ణా! మీరిద్దరూ వీరవ్రతధారులు. ఆర్తత్రాణ పరాయణులు. ఈ నరకుడొక్కడే కాదు. లోకంలో ఎక్కడెక్కడ ఆతతాయిల ఆగడాలు మితిమీరుతాయో, అక్కడక్కడ మీరు జోక్యం కల్పించుకోవలసే వస్తుంది' అన్నాడు.

అంతఃపురములో శ్రీకృష్ణుడు రుక్మిణికి మిగతా భార్యలకు నరకుని కథను, పదహారు వేల స్త్రీల దైన్యగాధను తెలిపాడు. తాను తిరిగి వచ్చిన దాకా ఈ ప్రయాణ రహస్యం పైకి పొక్కరాదన్నాడు. సత్యభామను వెంట తీసుకొనిపోవడమెందుకో భార్యలకు నచ్చజెప్పాడు. తన వంతు గృహ భారాన్ని రుక్మిణికి అప్పజెప్పాడు.

అనుకున్న ముహూర్తానికి సత్యాకృష్ణులు దేవకీ వసుదేవులకు మ్రొక్కి

వారి ఆశీర్వాదాలు స్వీకరించారు. తరువాత ఉగ్రసేనుల వారిని కలిసారు. ఉగ్రసేన మహారాజు ముందే కృష్ణుని సాహసయాత్రను దీవించారు. రేవతి బలరాములకు, సత్యకుల వారికి మ్రొక్కి వారి దీవెనలు పొందారు.

విజయదశమి ఉదయ ఘడియల్లో, దారుకుడు సారథిగా అందరికీ నమస్కరించి, సత్యభామా సమేతుడై రథాన్ని అధిరోహించాడు. వెంట వైనతేయుడు, వందమంది గరుడయోధులు బయలుదేరారు. సాధ్య మైనంతవరకు జనం దృష్టిలో పడకుండా, నగరాలను వదలి, చారులు ముందుగా అశ్వాలపై దగ్గర దారులను చూపుతూ నడవగా ప్రయాణం ముందుకు సాగింది. ఒక శ్రోత్రియుణ్ణి త్రివిష్టప ప్రభువుకు తెలిసిన వానిని అక్కడ నరేశునికి పంపాడు.

దశార్ణవంలో హిరణ్యవర్మ శ్రీకృష్ణునికి, సత్యభామకు ఘనంగా స్వాగత మిచ్చారు. అతిథి మర్యాదలైన తరువాత, అక్కడ రెండు రోజులుండి, మూడు రోజుల ప్రయాణం తర్వాత కాంపిల్యానికి చేరుకున్నారు.

'ఆనాడు ఒక్క శమంతకం కోసం నాతోపాటు ఎన్ని బాధలను ఎది రించావో! మళ్ళీ ఈనాడు నిన్ను బాధపెడుతున్నాను' అన్నాడు దారిలో సత్యభామతో కృష్ణుడు.

సత్య కన్నులలో ఒక వింత తలుకు మెరిసింది. కృష్ణస్వామితో తనకు కలిగిన మొదటి స్వర్గానుభవం-ఆ కొండదారుల్లో, ఋక్షరాజ్యంలో లభిం చిన ఏకాంత సౌందర్యలబ్ధి ఆమె స్మృతిని ఆర్ద్రం చేశాయి.

'ప్రభూ! మీ వెంట ఉండగలగడమే ఒక దివ్యానుభవం. మీతో సింహ ముఖంలోకి రమ్మన్నా సిద్ధమే'.

ఈ ప్రయాణం మొత్తంలో శ్రీకృష్ణుడు ఎవరితోనూ అవసరానికి మించి మాట్లాడలేదు. ఆ మౌనం సత్యభామను అద్భుతంగా ప్రభావితం చేసింది. కృష్ణ స్వామి నరకుని సంహరిస్తాడు అది తప్పదు. నిజమే-కాని నరకుని చెర నుండి విడిపించిన ఆ పదహారు వేల నూర్గురి గతి ఏమవు తుంది. ఎవరు వారిని ఆదుకునేది? **(సశేషం)**





# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**



## 8. వెలుగు బాట జూపు వేల్పు గురుడు



ఆ.వె. గోధుమలను విసరు గోప్యంబు యేమయ్య
విషపు రోగమునకు వింత మందు
దాన్ని పారద్రోలి దాసుల రక్షించు
సాయినాధ నీవె శరణు మాకు. 1

ఆ.వె. తిరుగు రాయికున్న తిరుగని రాయికి
మధ్య నలుగుచుండు మానవుండు
తిరుగలి పిడిబట్టి తిరముగా నుండగ
సాయినాధ నీవె శరణు మాకు. 2

ఆ.వె. గురుని చెంత నుంటు గురుని సేవించెడు
శిష్యుడెన్నటికిని చితికిపోడు
గురుని పదము బట్టి గురిగల్గి సేవించ
సాయినాధ నీవె శరణు మాకు. 3

ఆ.వె. గురుని పథమబట్టి గురుని వెంటనడువ
గురుతు మాసిపోదు గూటికేగ
జ్ఞానమూర్తి గురుడు గట్టిగా పట్టుము
సాయినాధ నీవె శరణు మాకు. 4

ఆ.వె. నీవు నడచు త్రోవ నిష్కంటకముజేసి
దారి తప్పకుండ తనదు శిష్య

కాచుచుండు దారి కాంతివంతముజేసి
సాయినాధ నీవె శరణు మాకు. 5

ఆ.వె. చేయిపట్టి నడుపు చేదోడు వాదోడు
తాను నడచినట్టి దారి మున్న
గురుడు వెంటనుండి గుర్తుగా జేర్చును
సాయినాధ నీవె శరణు మాకు. 6

ఆ.వె. చక్ర గతిన దిరుగు సంసార చక్రంబు
నాప గలుగువాడు నతడె గురుడు
సంచితముల బాపి సద్గతి గల్గించ
సాయినాధ నీవె శరణు మాకు. 7

ఆ.వె. ఈతి బాధలు దీర్చి ఈశ్వరుకడ జేర్చ
వెలుగు బాట జూపు వేల్పు గురుడు
మాట వినిన గురుని, మార్గము సుగమము
సాయినాధ నీవె శరణు మాకు. 8

ఆ.వె. సాయినాధ నాకు సానుకూలము గాను
మొఱను ఆలకించి మోక్షమిమ్ము
బంధనాలు దీర్చి బ్రహ్మలో నైక్యంబు
జేయుమయ్య సామి సేద దీర 9

ఆ.వె. నీదు సేవయున్న నీ భక్త జనసేవ
నిలసి చేయునటుల నిష్టనిమ్ము
నాదు స్వార్ధబుద్ధి నష్టము గావించి
కావుమయ్య నన్ను కామితార్ధి 10

తే,గీ. నిన్ను ధ్యానించ, పూజించ-నిన్ను దలచ
బాధలన్ని యుపశమించి బరువు దీరు
నీవు నావెంట నుండంగ నేల భయము
నీవు నాలోనె యుండంగ నేల చింత 11

**(సశేషం)**







# అమ్మతో ...

**- శ్రీ రామానంద ప్రభుజీ**

ఒళ్ళంతా కాలిపోతుంది. నడుం లాక్కుపోతుంది, కాళ్ళు నొప్పిగా ఉన్నాయి. చాలా నీరసంగా ఉన్నారు మాతాజీ. పడుకున్న కాసేపు మళ్ళీ మెలకువ వచ్చేస్తుంది. కాళ్ళు నొక్కుతున్న పిల్లలను చాలు అన్నట్లుగా సైగ చేసి 'రాముడిని' (రామన్న)ను పిలవండి అని చెప్పారు మాతాజీ. పిల్లలు దేవాలయానికి పరిగెత్తుకు వచ్చారు. దేవాలయం తాళం వేసి అమ్మ దగ్గరకు పరుగెత్తుకు వచ్చాను. ఏం పనిలో ఉన్నావు అన్నారు అమ్మ. దేవాలయంలో పని పూర్తి అయిపోయింది. హారతి ముగించుకొని బయటకు వచ్చాను. దూరం నుంచి బాబా దర్శనానికి భక్తులు వస్తే వారి తరఫున అర్చన చేసాను. వారు అటు వెళ్ళారు, పిల్లలు మీరు రమ్మన్నారని వచ్చారు అంతే అన్నాను. సరే అయితే అంటూ మంచం కింద ఉన్న స్టీలు డబ్బా లాగమని దాంట్లో నుంచి రెండు రవ్వలడ్డులు ఇస్తూ ఇలా చెప్పారు- నిరంతరం దైవ సేవలో, గురు సేవలో ఉంటున్న నీవు, నీ మనస్సు ఒక ఉన్నతమైన స్థాయిలో నిలుపు అంటూ - ఇది చదువు అని పుస్తకం తెరచి చూపించారు. నేను అమ్మ ముందు కూర్చుని చదవటం ప్రారంభించాను. పైకి చదవరా రాముడూ నేనూ వింటాను అన్నారు అమ్మ.

ఉదయం, సాయంత్రం రెండు గంటలు ధ్యానంలో గడపటం ఆధ్యాత్మిక జీవనం అనిపించుకోదు. ఆ ధ్యానపు మనఃస్థితిని రోజంతా నిలుపుకోవాలి. రోజువారీ పనులను మనం చేస్తున్నా, మనలో ఒక ఆధ్యాత్మిక ప్రవాహం కొనసాగుతూ ఉండాలి. దీనివలన అపవిత్రమైన ఆలోచనలు మనలో తలెత్త కుండా ఉంటాయి. ధ్యానానికి కూర్చున్నప్పుడు చక్కగా మనస్సును ఏకాగ్ర పరచడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. మనం రోజూ చేసే ధ్యాన సాధనకు గురి పూర్ణంగా లేదా అనుబంధంగా, ఈ భగవత్సాన్నిధ్యాన్ని

అభ్యాసం చేయాలి. సరైన దృక్పథంతో చేయగలిగితే, ఇదే ఒక తీవ్రమైన సాధన అవుతుంది. ఏకాగ్రత లేకుండా గంటల తరబడి చేసే ధ్యానం కంటే, ఇది ఎంతో మంచిది.

భగవద్గీత రెండవ అధ్యాయంలో ముక్తిని పొందిన మానవుని (స్థిత ప్రజ్ఞుని) లక్షణాలు ఎలా ఉంటాయని అర్జునుడు ప్రశ్నిస్తాడు. భగవద్గీత లోనూ, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలలోనూ పదేపదే ఇలా పరిపూర్ణతను సాధించిన సాధకుని లక్షణాలను ఏకరువు పెట్టవలసిన అవసరం ఏమిటి? ఆదిశంకరాచార్యులు భగవద్గీత రెండవ అధ్యాయపు భాష్యంలో ఈ విష యాన్ని వివరించారు. పరిపూర్ణతను ఇంకా చేరుకోని సాధారణ సాధకులు, ఈ పరిపూర్ణతను సాధించిన పురుషుని లక్షణాలను ఆదర్శవంతమైనవిగా భావిస్తూ, అభ్యాసం చేయాలి. సాధారణ సాధకునికి ఎంతో కష్టంగా చేసే అభ్యాసాలు, పరిపూర్ణత సాధించిన వారికి అలంకారాలతో సమానం.

ఈ సూచనలన్నింటి ముఖ్యోద్దేశం ఏమిటంటే, మనస్సును అన్నివేళలా ఉన్నతమైన స్థాయిలో ఉంచుకోవడమే! మనస్సు క్రింది స్థాయిలకు రాకుండా చూచుకోవడం చాలా అవసరం. మీరు ఉన్నతమైన మీ పారమార్థికా ధర్మాన్ని మరిచిపోయి, ప్రాపంచికమైన వ్యవహారాలలో కూరుకు పోయినప్పడు మనస్సు దిగజారుతుంది. మన పనుల నుండి బాధ్యతల నుంచి తప్పించుకోవటం ఎలాగూ సాధ్యం కాదు కాబట్టి, వీటినే భగవంతునితో అనుసంధానించే సాధనాలుగా, మాధ్యమాలుగా మలచు కోవాలి. ఈ విధంగా చేయలేకపోతే, ద్విసంధ్యలలో మనం తీవ్రంగా చేస్తున్నామనుకొనే జపధ్యానాలు పారమార్థిక పురోగతిని ఇవ్వలేవు. మనం సర్వకాల సర్వావస్థలలో భగవంతుణ్ణి జ్ఞాపకం పెట్టుకోవాలి. ఈ పని చేయడానికి కల ఏకైక మార్గం, మనం చేసే ప్రతి ఆలోచననూ, ప్రతి కార్యాన్నీ దైవంతో ముడిపెట్టడమే. మనస్సును ఖాళీగా ఏ ఆలోచనా





లేకుండా ఉంచడం, గతాన్ని తలుచుకుంటూ పరిపరివిధాల మధన పడటం వంటి పోకడలు ప్రమాదకరం. అవి మన ప్రగతికి నిరోధకాలుగా పనిచేస్తాయి. మనస్సును శూన్యంగా, తగినంత పనిలేకుండా ఉండటం వలన పనికిమాలిన ఆలోచనలను చేయడం లేదా గతాన్ని గురించి వగచడం చేస్తూ ఉంటుంది. దీనివలన ప్రయోజనం సున్నా.

మీరు ఒకవేళ అటువంటి మనఃస్థితికి చేరుకుంటే వెంటనే ఏదో సద్గ్రంథాన్ని తీసుకుని పఠించండి. లేదా ఎవరికైనా నిస్వార్థసేవను చేయండి. అప్పడు మనఃస్థితి మనల్ని వదిలిపోతున్నట్లు మీరే గమనిస్తారు. గతాన్ని తవ్వకుంటూ కూర్చోవడం వలన మీరు సమయాన్ని వృథా చేయడమే కాక కొత్తకొత్త అడ్డంకులను 'స్వయంకృషి'తో తయారు చేస్తారు. గ్రంథపఠనం యొక్క ప్రాముఖ్యతను ఎక్కువచేసి చెప్పడం లేదు. సాధకులందరికీ ఇది చాలా ముఖ్యం. ధ్యానం ద్వారా సర్వాన్ని సాధించ వచ్చనీ, గ్రంథపఠనం అనవసరం అనీ అనుకోవడం విర్రవీగడమే అవుతుంది. నిస్సందేహంగా ధ్యానం మనలోని ఉన్నతమైన జ్ఞానకేంద్రాలను తెరుస్తుంది. కానీ, మనలోని మానసిక శక్తులను, ప్రాణశక్తులను ఆ కేంద్రాల ద్వారా లేవనెత్తడం అంత సులువు కాదు. ఆ శక్తులలోని 'మిగులు' క్రింద కేంద్రాల వద్దే ఉండిపోయి, మన మనస్సులో లేనిపోని కలతలు రేగవచ్చు. కాబట్టి గ్రంథపఠనం, నిస్వార్థసేవలను సాధనలో భాగంగా స్వీకరించాలే గానీ వాటిని వేరుగా చూడటం, నిర్లక్ష్యం చేయడం పనికిరాదు. మన సాధనలో అవి తప్పనిసరి అయిన విద్యుక్త ధర్మాలు. మీరు సృజనాత్మకతతో నిండిన పనులను (అంటే సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం వంటి లలిత కళలు) వేరే సమయాలలో చేయగలిగితే, ఇక జీవితంలో విసుగుకు తావుండదు. లేకపోతే ప్రారంభదశలోని సాధకులకు ఆధ్యాత్మిక జీవనం కష్టతరంగా మారుతుంది.

ఒక రోజులో ఎన్నిసార్లు దైవం గూర్చి ఆలోచిస్తామో అదే మన ఆధ్యా

త్మిక జీవితానికి కొలబద్ద. పారమార్థిక జీవనం అంటే కేవలం రోజుకు రెండు సార్లు ధ్యానం చేయడం కాదు. మన దైనందిన పనులలో, విధి నిర్వహణల మధ్య నిరంతర భగవద్భావనలు పుడుతూ ఉండాలి. అదే నిజమైన ఆధ్యాత్మిక జీవనం. ఇలా కాకపోతే మీరు 'ఒకరోజు రాజు'లాగా ఒకటి రెండు గంటలు మాత్రమే ఆధ్యాత్మికులుగా ఉంటారు. మిగిలిన సమయాలలో మీకు ప్రాపంచికులకు తేడా ఏమీ ఉండదు.

ఈ విధంగా మనలోని దివ్యత్వాన్ని పదేపదే జ్ఞప్తికి తెచ్చుకోవాలంటే, ప్రయత్నపూర్వకమైన దీర్ఘకాల పరిశ్రమ చాలా అవసరం. ఎన్నో చేదు అనుభవాలు, ఎంతోమంది నిష్ఠురమైన మనుష్యులు ఎదురుకావచ్చు. అందువలన మనస్సు కలత చెందదా? మనం చేయవలసిందేమిటంటే ఆ అనుభవాలను కూడా దైవంతో అనుసంధానించాలి. భగవంతుని విశాల సృష్టిలో, మనకు జీవితంలో ఎదురుపడే చెడ్డవారికి, దురదృష్టకరమైన సంఘటనలకు కూడా చోటు ఉందని గ్రహించాలి. అప్పుడు మన మీద అవి చూపగలిగే ప్రభావపు తీవ్రత తగ్గుతుంది. పట్టువిడవకుండా అభ్యాసం చేసి, మనలోని దివ్యత్వాన్ని ముందుకుతెచ్చి, అహంకారాన్ని వెనక్కు పంప గలుగుతాము. క్రమక్రమంగా మన ఆలోచనలలో దైవానికి అతి ముఖ్య మైన స్థానాన్ని ఇవ్వగలుగుతాము. అల్పమైన అహంకారానికి అంటిపెట్టు కోవడమే ఆధ్యాత్మిక జీవనంలో ఎదురయ్యే ముఖ్య సమస్య దీన్ని తగ్గించాలి. ఇతరులు, పరిస్థితులు మన ఆధ్యాత్మిక సాధనకు అడ్డంకులుగా మారే అవకాశం కన్నా, మనపట్ల మనకున్న దృక్పథమే ఒక అడ్డంకిగా మారే అవకాశం ఎక్కువ. ఇక చాల్లే ఆ పుస్తకం పక్కన పెట్టు. నాక్కూడా భోజనం పెట్టరా అంటూ లేచారమ్మా. ఆవిడ శరీరానికే రుగ్మతలు కానీ ఆవిడ మనస్సు ఎప్పుడూ నిత్యనూతనం.

ఆనాటి గుర్తులు నెమరువేసుకుంటున్న మీ శ్రీ రామానంద ప్రభుజీ.





# మాతృసంస్థ కబుర్లు

## శ్రీ కోదండరామ సాయి సన్నిధానం ఆశ్రమం

## సాయిధామం ఆశ్రమ శాఖ - సత్తెనపల్లి

శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమంలో జనవరి 13వ తేదీ ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమం, కోదండ రామాలయం, ఆనందసాయి ప్రభు మందిరంలో వైభవోపేతంగా జరిగినది.

ప్రతి సంవత్సరం సత్తెనపల్లి పరిసర గ్రామాల నుండి సుమారు 3000 మంది భక్తులు వచ్చి దర్శించుకొనే ఈ కార్యక్రమానికి కావలసిన ఏర్పాట్లన్నీ 12వ తేదీ రాత్రికి అంతా పూర్తి చేసాము. పూల అలంకరణ, ప్రసాదాల తయారీ, భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్ ఏర్పాట్లు, మంచినీళ్ల ఏర్పాట్లు, ప్రసాద వినిమయం చేయడానికి, అన్ని ఏర్పాట్లు, ఆశ్రమ కార్యకర్తలు అందరూ అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రంతా మేలుకొని శక్తివంచన లేకుండా వేకువజాము గం.3.00లకు పూర్తి చేసారు. బ్రహ్మముహూర్త సమయానికి వచ్చిన భక్తులు, కార్యకర్తలు ప్రధాన ద్వారం దగ్గర వేచి ఉండగా పూజారిగారు కొబ్బరికాయ కొట్టి, హారతిచ్చి పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి పాదుకలు, చిత్రపటముతో అందరూ వెంటరాగా సాయినామం పలుకుతూ, కోదండ రామునికి జయజయధ్వానాలు పలుకుతూ మంగళ వాయిద్యం మ్రోగు చుండగా, ఆశ్రమమంతా విద్యుద్దీపకాంతితో, పచ్చని తోరణాలు, పూల అలంకరణలతో శోభాయమానంగా ఉన్న వాతావరణంలో ద్వారం తెరచి ముందుగా రామాలయం ఉత్తరద్వారం వైపు నడిచారు. అక్కడ కొబ్బరి కాయ కొట్టి ద్వారం తెరిచారు. పలురకాల పూలు, పూలమాలలతో నూతన వస్త్రాలంకృతులైన ఉత్సవమూర్తులు దేదీప్యమానమైన వెలుగుతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మూలవిరాట్టులైన సీతా లక్ష్మణ, హనుమత్సమేత

కోదండ రాముల వారిని చూడటానికి రెండు కళ్ళు చాలవన్నట్లుగా దివ్య తేజస్సుతో దర్శనమిచ్చారు. పూజారిగారు కొబ్బరికాయ కొట్టి స్వామి వారికి హారతిచ్చారు. అనంతరం ఆనందసాయి ప్రభు మందిరం ఉత్తరద్వారంలో కొబ్బరికాయ కొట్టి ద్వారం తెరిచారు. దివ్యతేజస్సుతో నూతన వస్త్రధారులై, కిరీటధారులై, పూలమాలాలంకృతులై చిరుమందహాసంతో దర్శనమిచ్చిన శ్రీ ఆనంద సాయి ప్రభు వారిని దర్శించుకొని హారతిచ్చి అనంతరం ఆంజనేయ స్వామి వారికి, పరమపూజ్య గురుదేవులకు కొబ్బరికాయ కొట్టి హారతిచ్చి పూజారిగారు గురుదేవుల పాదుకలు, చిత్రపటము ధ్యాన మందిరములో ఉంచి, ఉత్సవమూర్తులకు పూజా కార్యక్రమం నిర్వహించిన తరువాత క్యూలైన్ ద్వారా భక్తులు రావడం మొదలైనది. ఆశ్రమ ప్రాంగణ మంతా భక్త జన సందోహంతో సీతారామ చంద్ర మూర్తికి జై అని రామ నామ స్మరణతో మారుమ్రోగినది. దర్శనం ప్రారంభమైన కొద్ది సమయానికి ఆకాశం స్వామి వారిని అభిషేకిస్తుందా అన్నట్లు చిరుజల్లు పడినది. అనంతరం ఎటువంటి ఆటంకం లేకుండా దాదాపుగా మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులు వచ్చి దర్శనం చేసుకున్నారు. రామాలయం ముందు వేసిన గోవింద నామం, శంఖుచక్రాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగ కుండా కార్యకర్తలు ప్రసాదం, త్రాగునీరు అందించారు. ఇంత పెద్ద కార్యక్రమం నడిపించడం వెనుక పరమపూజ్య గురుదేవులు, పూజ్య మాతాజీ ఆశీస్సులు, శ్రీశ్రీశ్రీ శ్రీరామానంద ప్రభుజీవారి ఆకాంక్ష ఉన్నా యనడంలో అతిశయోక్తి లేదు. ఆశ్రమమే ముందు తరువాతే మనం, ఎటువంటి పరిస్థితులలో కూడా ఆశ్రమ కార్యక్రమాలు నిరాఘాటంగా జరగటానికి మనమేం చెయ్యగలం కాదు మనమే చెయ్యగలం అని చెప్పిన గురువుగారు, మాతాజీ గారి మాటలు మా హృదయాల్లో ఇంకా పదిలంగా ఉన్నాయి. ఈ కార్యక్రమం ఆద్యంతం విశేష కృషిచేసిన కార్యకర్తలకు, ప్రత్యక్షంగా ఆర్థిక సహకారం అందించిన భక్తులకు సీతాసమేత కోదండ రాముని, ఆనంద సాయిప్రభువారి, గురుదేవుల దివ్యఆశీస్సులు





లభించాలని శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ తరపున హృదయపూర్వకంగా కోరుతున్నాము.

ఫిబ్రవరి 21వ తేదీ పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారి 83వ జయంతోత్సవం ఘనంగా జరిగినది. 21వ తేదీ ఉదయం గురుదేవులకు అభిషేక, పూజా కార్యక్రమాలు నిర్వహించాము. వివిధ రకాల పూలమాలలతో గురుదేవుల మందిరాన్ని అలంకరించాము. రాత్రి గం.8.00లకు వచ్చిన భక్తులతో పూజా కార్యక్రమం నిర్వహించాము. అనంతరం భక్తులందరూ గురుదేవుల ఆశీరక్షతలు అందుకున్న తరువాత, వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగినది.

"నా భక్తుని ఇంటిలో అన్నవస్త్రములకు ఎప్పుడు లోటుండదు. నాయందే మనస్సు నిలిపి, భక్తిశ్రద్ధలతో మనఃపూర్వకముగా నన్నే యారాధించు వారి యోగక్షేమముల నేను జూచెదను.

– శ్రీ సాయిబాబా

**సాయివాణి పాఠకులందరికీ**

**శుభకృత్ సంవత్సరాది,**

**శ్రీరామనవమి శుభాశీస్సులు**

**- సాయిధామం**